


# మన భద్రాద్రి న్యూస్

మన అక్షరం ....... ప్రజల ఆయుధం

సంపుటి : 7 | సంచిక : 131 | E-Mail : manabhadradrinews@gmail.com | ఎడిటర్ : నరసింహా రెడ్డి | 80192 72934 | వెల : 4/- | పేజీలు : 6

తెలంగాణ | https://epaper.manabhadradri.com, www.mb9news.in | మంగళవారం 23 జూన్ 2026

## వాయుసేన విమానాశ్రయానికి
# సహకరిస్తాం

- రాజ్‌నాథ్‌సింగ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ.. 20 నిమిషాలపాటు చర్చ
- వాయుసేన టెర్మినల్‌తోపాటు కార్గో, ఎమ్ఆర్‌వో, హ్యాంగర్ సౌకర్యాలు కల్పించాలి
- రైల్వేశాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి భేటీ
- మెట్రో ఫేజ్-2 అనుమతులపై చర్చ
- మూడు రోజుల దిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- మెట్రోరైలు ఫేజ్-2కు అనుమతులపై అశ్వినీవైష్ణవ్‌తో చర్చ



హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వీనీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన రైల్వేమంత్రితో రైల్‌భవన్‌లో సమావేశం అయ్యారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 అనుమతుల అంశంపై ఆయనతో చర్చించారు. ఐఆర్‌ఎఫ్‌సీ రుణ నిధుల విడుదలకు సంబంధించిన అంశాలపై కూడా సమీక్షించినట్లుగా సమాచారం. ఇటీవల కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ లేఖను రాసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరంలో మెట్రో రైలుకు ఐఆర్‌ఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేవిధంగా చూడాలని లేఖలో కోరిన విషయం తెలిసిందే. రైల్వేమంత్రి అశ్వీనీ వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే ముగ్గురు సమావేశం అవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకు ముందు, రక్షణ - మిగతా 3లో



## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి

- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- లక్నో కోచింగ్ సెంటర్‌లో భారీ అగ్నిప్రమాదం
- ఘటనలో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధారణ
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటన
- సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఉన్నతాధికారులు



## బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..

- ప్రధాని పదవికి కీర్ స్టార్మర్ రాజీనామా!
- లేబర్ పార్టీ నాయకత్వాన్నీ వీడుతున్నట్లు ప్రకటన



## స్థానికతపై ద్వంద్వ విధానం తగదు

- స్థిరమైన ప్రమాణాలను పాటించాలన్న హైకోర్టు
- టీజీపీఎస్సీ అప్పీల్ పిటిషన్ కొట్టివేత
- అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదువలేదు
- కారణంతో అభ్యర్థిని స్థానికుడిగా గుర్తించలేదు

## టెక్నాలజీ వినియోగం నుంచి సృష్టికర్తగా.. డిజిటల్ రంగంలో గ్లోబల్ పవర్‌హౌజ్‌గా భారత్

- గత 12 ఏళ్లలో గ్లోబల్ డిజిటల్ శక్తిగా ఎదిగిన భారత్
- 102 కోట్లకు చేరిన ఇంటర్నెట్ కనెక్షన్లు.. భారీగా పెరిగిన బ్రాడ్‌బ్యాండ్
- ఏఐ, సెమీకండక్టర్ల రంగంలో భారీ పెట్టుబడులు, కీలక ప్రాజెక్టులు




## రెండో విడతలో పూరిళ్లకే అధిక ప్రాధాన్యం


- 'షీర్‌వాల్' పద్ధతిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- నిర్మాణ వ్యయాలను దృష్టిలో పెట్టుకుని సర్కార్ కొత్త నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా 24 వేల పూరిళ్లను గుర్తించిన అధికారులు

## ఉద్ధవ్ థాకరేకు భారీ షాక్..



- షిండే వర్గంలో చేరిన ఆరుగురు ఎంపీలు
- లోక్‌సభలో 9 నుంచి 3కి పడిపోయిన యూబీటీ బలం
- ఆపరేషన్ టైగర్ విజయవంతమైందన్న ఏక్‌నాథ్ షిండే
- అభివృద్ధి నిధుల కోసమే పార్టీ మారామంటున్న ఎంపీలు
- ఎన్నికల తర్వాత అమ్ముడుపోయారంటూ ఉద్ధవ్ ఫైర్

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు



- ఆర్డీఎస్, తుంగభద్ర జలాలపై ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో ఉత్తమ్ సమీక్ష
- తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్న ఉత్తమ్
- జలవివాదాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ఆదేశాలు

హైదరాబాద్

తెలంగాణ నీటి హక్కుల పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర జల వివాదాలపై ఫోకస్ పెట్టింది. సచివాలయంలో నీటిపారుదల శాఖ ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఈరోజు అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్), తుంగభద్ర డ్యామ్ పరిధిలో తెలంగాణకు రావాల్సిన కృష్ణా నదీ జలాల వాటాపై ఈ మీటింగ్‌లో - మిగతా 3లో




## భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం.. ఏఐతో భారీ డిమాండ్!

- ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌తో భారత్‌లో పెరుగుతున్న డేటా సెంటర్ల డిమాండ్
- గోల్డ్‌మన్ సాక్స్ నివేదికలో కీలక అంశాల వెల్లడి
- ఆసియాలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్కెట్‌గా గుర్తింపు
- ముంబై, చెన్నై ప్రధాన కేంద్రాలుగా వేగంగా విస్తరణ



# ఉద్ధవ్ థాకరేకు భారీ షాక్..



శివసేన-యూబీటీ అధినేత ఉద్ధవ్ ఠాక్రేకు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు తిరుగుబాటు ఎంపీలు అధికారికంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే నేతృత్వంలో శివసేనలో చేరారు. దక్షిణ ముంబయిలోని వై.బి.చవాన్ సెంటర్‌లో ఏకనాథ్ శిందే సమక్షంలో వీరు పార్టీ కండువా కప్పుకున్నారు. లోక్‌సభలో శివసేన ఖదీకి మొత్తం తొమ్మిది మంది ఎంపీలు ఉండగా, అందులో ఏకంగా ఆరుగురు పార్టీ మారారు. ఈ పరిణామంతో లోక్‌సభలో శిందే వర్గం శివసేన ఎంపీల బలం 7 నుంచి 13కి పెరిగింది. మూడింట రెండొంతుల మెజారిటీ ఎంపీలు శివసేన-ఖదీని వీడటంతో వీరిపై పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద అనర్హత వేటు పడే అవకాశం లేదు.

**ఊహాగానాలకు తెర**

గత కొన్ని రోజులుగా సాగుతున్న రాజకీయ ఉత్కంఠకు, ఊహాగానాలకు తెరదించుతూ, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) వర్గానికి చెందిన ఆరుగురు ఎంపీలు- సంజయ్ హరిభావు జాదవ్, సాహెబ్ రాజారామ్ వాక్‌చౌరే, ఓంప్రకాశ్ భూపాల్ సింగ్, నింబాల్కర్, సంజయ్ దినా పాటిల్, సంజయ్ ఉత్తమ్ రావ్ దేశ్‌ముఖ్, నగేశ్ బాపూరావ్ పాటిల్ అస్తికర్ సోమవారం ఏక్‌నాథ్ శిందే వర్గంలో చేరారు. ఈ సందర్భంగా ఏక్‌నాథ్ శిందే విలేకరులతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.

"శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు ఇవాళ మా పక్షంలో చేరారు. అసలైన శివసేనను కాపాడుకునేందుకు 2022లో జరిగిన రాజకీయ చీలికకు ఇది కొనసాగింపు. ఈ ఎంపీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా, తమ నియోజకవర్గాల అభివృద్ధి కోసమే మా పార్టీలో చేరారు. బాలాసాహెబ్ ఠాక్రే, ఆనంద్? దిఘేల అసలైన శివసేనలోకి ఈ ఆరుగురు కట్టర్ శివసైనిక్ ఎంపీలను మేము స్వాగతిస్తున్నాం. 2022లో బాలాసాహెబ్ శివసేనను రక్షించుకోవడానికి 40 మంది ఎమ్మెల్యేలతో కలిసి మేము తిరుగుబాటు చేశాం. ఇది అదే ఉద్యమానికి చెందిన రెండో దశ. శివసేన సిద్ధాంతాలను, బాలాసాహెబ్? ఆశయాలను కాపాడడమే మా లక్ష్యం. అందుకే ఈ ఎంపీలు అసలైన శివసేనలోకి రావాలని నిర్ణయించుకున్నారు. దీనితో ఆపరేషన్ టైగర్ సక్సెస్ అయ్యింది."

**మా దగ్గర చాలా మంది 'సంజయ్'లు ఉన్నారు!**

ఇదే సమయంలో తిరుగుబాటు ఎంపీలపై విమర్శలు గుప్పిస్తున్న శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్‌పై శిందే తనదైన శైలిలో చమత్కార బాణాలు వదిలారు. "ఈ రోజు ఆరుగురు ఎంపీలు మాతో చేరారు. కాబట్టి ఇప్పుడు మా వద్ద ముగ్గురు 'సంజయ్'లు ఉన్నారు. వీరితోపాటు మా ఎమ్మెల్యే సంజయ్? రాథోడ్? కూడా ఇక్కడే ఉన్నారు. మా వద్ద ఇంత మంది సంజయ్?లు ఉన్నప్పుడు, ఇక వేరే సంజయ్ (రౌత్) గురించి మాట్లాడాల్సిన అవసరం లేదు. నేను ఎవరి గురించి మాట్లాడుతున్నానో మీకు తెలుసు కదా" అని అన్నారు.

**మాకు ప్రజల మద్దతు ఉంది!**

2022లో తాము చేసిన తిరుగుబాటుకు ప్రజల మద్దతు లభించిందని, ప్రస్తుతం శివసేనకు 60 మంది ఎమ్మెల్యేలు ఉన్నారని ఏక్?నాథ్ శిందే పేర్కొన్నారు. "ఓంరాజే నింబాల్కర్? తన కార్యకర్తలతో చర్చించిన తర్వాత, పెద్ద మనస్సుతో మా వద్దకు వచ్చారు. ప్రజలు ఆయన్ను రీల్ స్టార్ అంటారు. కానీ నా దృష్టిలో ఆయన రియల్ స్టార్?. వీరంతా తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాలేదు. తమ నియోజక వర్గాల బాగు కోసం వచ్చారు. 2022లో మేము తీసుకున్న నిర్ణయాన్ని ప్రజలు అంగీకరించారు. ఆ తర్వాత మేము ప్రజా కోర్టులో(ఎన్నికల్లో)కి వెళ్లినప్పుడు ప్రజలు మమ్మల్ని ఆదరించారు. మేము తిరుగుబాటు చేసినప్పుడు మా వద్ద కేవలం 40 మంది ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. కానీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో మా బలం 40 నుంచి 60కి పెరిగింది" అని శిందే గుర్తుచేశారు.

**ఆపరేషన్ టైగర్ సక్సెస్?**

2022లో శిందే పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ఉద్ధవ్ ఠాక్రే నుంచి విడిపోయి, పార్టీని రెండుగా చీల్చిన సంగతి తెలిసిందే. లోక్?సభలో శివసేన (యూబీటీ)కి 9 మంది ఎంపీలు ఉన్నారు. కానీ గతవారం శివసేన (యూబీటీ) పిలిచిన పార్లమెంటరీ పార్టీ సమావేశానికి కేవలం 3 లోక్?సభ ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. దీనితో తిరుగుబాటు చేసిన ఆరుగురు ఎంపీలపై క్రమశిక్షణా చర్యలు చేపట్టినట్లు ఉద్ధవ్ ఠాక్రే వర్గం ప్రకటించింది. ఈ నేపథ్యంలో వారు శిందే వర్గంలో చేరడంతో ఆపరేషన్ టైగర్ సక్సెస్ అయ్యిందని చెప్పవచ్చు.

# బ్రిటన్ రాజకీయాల్లో సంచలనం..

బ్రిటన్ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ (63) తన పదవికి, అధికార లేబర్ పార్టీ నాయకత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. సొంత పార్టీ నుంచే పెరిగిన ఒత్తిడి, నాయకత్వంపై అసంతృప్తి నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. డౌనింగ్ స్ట్రీట్‌లోని అధికార నివాసం నుంచి భార్యతో కలిసి బయటకు వచ్చిన స్టార్మర్‌కు మద్దతుదారులు చప్పట్లతో వీడ్కోలు పలికారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన దేశ ప్రయోజనాలనే ఎప్పుడూ ముందుంచానని చెప్పారు. "నేను ప్రేమించే దేశాన్ని ముందు ఉంచడానికే ప్రతి నిర్ణయం తీసుకున్నాను" అని పేర్కొన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో లేబర్ పార్టీ ఘన విజయం సాధించిన విషయాన్ని స్టార్మర్ గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పలు రంగాల్లో పురోగతి సాధించిందని తెలిపారు. ఆర్థిక వృద్ధి, వేతనాల పెరుగుదల, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆరోగ్య సేవల మెరుగుదల,




కార్మికులు-అద్దెదారుల హక్కుల బలోపేతం వంటి అంశాలను ప్రస్తావించారు. రక్షణ వ్యయాన్ని పెంచడం, అక్రమ వలసలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవడం, చిన్నారుల పేదరికం తగ్గించే కార్యక్రమాలు అమలు చేయడం తమ ప్రభుత్వ ప్రధాన విజయాలని పేర్కొన్నారు. అయితే గత కొన్ని నెలలుగా స్టార్మర్ నాయకత్వంపై విమర్శలు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిగా అమలు చేయలేకపోయారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు. పలు విధానాలపై వెనక్కి తగ్గడం, ప్రజాదరణ తగ్గడం కూడా ఆయనపై ఒత్తిడిని పెంచింది. లేబర్ పార్టీకి చెందిన 100 మందికిపైగా ఎంపీలు స్టార్మర్ రాజీనామా చేయాలని లేదా పదవి వీడే గడువును ప్రకటించాలని బహిరంగంగా డిమాండ్ చేసినట్లు సమాచారం. స్టార్మర్ వైదొలగడంతో గత పదేళ్లలో బ్రిటన్‌లో ఏడుగురు ప్రధానులు మారినట్లైంది. తరచూ నాయకత్వ మార్పులు చోటుచేసుకోవడం దేశ రాజకీయాల్లో నెలకొన్న అస్థిరతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రజా సేవలపై ఒత్తిడి, ఆర్థిక సవాళ్లు, అక్రమ వలసల వంటి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయనే విమర్శలు బ్రిటన్‌లో పెరుగుతున్నాయి.

## టెక్నాలజీ వినియోగం నుంచి సృష్టికర్తగా..

# డిజిటల్ రంగంలో గ్లోబల్ పవర్‌హౌజ్‌గా భారత్

గడిచిన 12 ఏళ్లలో భారతదేశం ప్రపంచ డిజిటల్ శక్తిగా అవతరించింది. ఒకప్పుడు కేవలం టెక్నాలజీ వినియోగదారుగా ఉన్న దేశం.. ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్లు, క్వాంటం టెక్నాలజీస్, డేటా సెంటర్లు వంటి అత్యాధునిక రంగాల్లో ప్రపంచ స్థాయి పరిష్కారాలను సృష్టించే స్థాయికి ఎదిగింది. బలమైన ప్రభుత్వ విధానాలు, విస్తరిస్తున్న డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలకు అనుకూలమైన వాతావరణం ఈ మార్పునకు దోహదపడ్డాయని సోమవారం విడుదల చేసిన అధికారిక ఫ్యాక్ట్-షీట్ వెల్లడించింది.




**'డిజిటల్ ఇండియా' కార్యక్రమం కీ రోల్**

ఈ భారీ పరివర్తనకు 'డిజిటల్ ఇండియా' కార్యక్రమం కీలక పాత్ర పోషించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2014లో 25.15 కోట్లుగా ఉన్న ఇంటర్నెట్ కనెక్షన్లు 2026 నాటికి 102 కోట్లకు పైగా పెరిగాయి. ఇదే సమయంలో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 6.1 కోట్ల నుంచి దాదాపు 100 కోట్లకు చేరాయి. దేశవ్యాప్తంగా ఆప్టికల్ ఫైబర్ కవరేజీ 42 లక్షల రూట్ కిలోమీటర్లకు పైగా విస్తరించగా, దాదాపు అన్ని జిల్లాలకు 5+ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అత్యాధునిక టెక్నాలజీల రంగంలోనూ భారత్ తన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుకుంది. 'నేషనల్ సూపర్ కంప్యూటింగ్ మిషన్' కింద దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో 47 పెటాఫ్లాప్‌ల సామర్థ్యంతో 38 సూపర్ కంప్యూటర్లను ఏర్పాటు చేశారు. వీటిలో దేశీయంగా అభివృద్ధి చేసిన 'పరం రుద్ర' వంటి సిస్టమ్స్ కూడా ఉన్నాయి. అదేవిధంగా రూ.10,300 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభించిన 'ఇండియాఏఐ మిషన్' ద్వారా 38,000కు పైగా జీపీయూలతో కూడిన కంప్యూటింగ్ సదుపాయాన్ని నిర్మిస్తున్నారు. 'ఏఐ కోశ్' ప్లాట్‌ఫామ్‌లో ఇప్పటికే 20 రంగాలకు చెందిన 12,000కు పైగా డేటాసెట్లు, 300కు పైగా ఏఐ మోడల్స్ అందుబాటులో ఉన్నాయి.

**మంచి ఫలితాలిస్తోన్న 'సెమికాన్ ఇండియా'**

సెమీకండక్టర్ల తయారీలో స్వావలంబన కోసం రూ.76,000 కోట్లతో ప్రారంభించిన 'సెమికాన్ ఇండియా' కార్యక్రమం మంచి ఫలితాలనిస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ.1.64 లక్షల కోట్ల విలువైన 12 ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటిలో సెమీకండక్టర్ ఫ్యాబ్రికేషన్ ఫెసిలిటీ, చిప్ ప్యాకేజింగ్ ప్లాంట్లు ఉన్నాయి. మరోవైపు, క్వాంటం టెక్నాలజీలోనూ భారత్ ముందంజ వేస్తోంది. రూ.6,003.65 కోట్ల కేటాయింపులతో 'నేషనల్ క్వాంటం మిషన్'ను ప్రారంభించి, పలు స్టార్టప్‌లకు మద్దతు ఇస్తోంది. ఇటీవల 1,000 కిలోమీటర్ల దూరానికి సురక్షితమైన క్వాంటం కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌ను విజయవంతంగా ప్రదర్శించింది. దేశంలో డేటా సెంటర్ల సామర్థ్యం కూడా వేగంగా పెరుగుతోంది. 2020లో 375 మెగావాట్లుగా ఉన్న సామర్థ్యం, 2025 నాటికి నాలుగు రెట్లు పెరిగి దాదాపు 1,500 మెగావాట్లకు చేరింది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, నోయిడా, జామ్‌నగర్ ప్రధాన హబ్‌లుగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇక డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ) విషయంలో ఆధార్, యూపీఐ, డిజిలాకర్, కోవిన్ వంటి ప్లాట్‌ఫామ్‌లతో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. డీపీఐ సహకారం కోసం ఇప్పటికే 23 దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకోగా, సింగపూర్, యూఏఈ, ఫ్రాన్స్, నేపాల్, శ్రీలంక వంటి దేశాల్లో యూపీఐ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

**గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 38వ స్థానానికి మెరుగుపడిన ర్యాంకు**


ఈ స్థిరమైన ప్రగతి ఫలితంగా 'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్'లో భారత్ ర్యాంకు 2015లో 81వ స్థానం నుంచి 2025 నాటికి 38వ స్థానానికి మెరుగుపడింది. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, పరిశోధనలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులపై పెడుతున్న పెట్టుబడులతో భవిష్యత్ టెక్నాలజీలకు, ఆవిష్కరణలకు భారత్ విశ్వసనీయమైన గ్లోబల్ హబ్‌గా మారుతోందని ప్రభుత్వం తన నివేదికలో పేర్కొంది.

## లక్నో అగ్నిప్రమాదంలో 14 మంది మృతి



ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో సోమవారం ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అలీగంజ్‌లోని పురానియా ప్రాంతంలో ఉన్న ఓ మూడు అంతస్తుల భవనంలోని కోచింగ్ సెంటర్‌లో చెలరేగిన మంటల కారణంగా 14 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి (పీఎంఎన్‌ఆర్‌ఎఫ్) నుంచి రూ. 2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ. 50,000 చొప్పున పరిహారం ప్రకటించారు. వివరాల్లోకి వెళితే, పురానియాలోని ఓ వాణిజ్య భవనంలో నిర్వహిస్తున్న కోచింగ్ సెంటర్‌లో సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే దట్టమైన పొగ భవనం మొత్తాన్ని చుట్టుముట్టడంతో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పై అంతస్తుల నుంచి కిందికి దూకడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఈ దుర్ఘటనలో మరణించిన వారంతా 20 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారేనని అధికారులు తెలిపారు. ఈ ప్రమాద వార్త తెలియగానే ఉప ముఖ్యమంత్రి బ్రజేష్ పాఠక్ హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరోవైపు, అలీగఢ్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తన పర్యటనను అర్ధాంతరంగా రద్దు చేసుకుని లక్నోకు తిరిగి వచ్చారు. ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఆయన, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, ఇతర బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. భవనం గోడలను పగలగొట్టి లోపల చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదని, దర్యాప్తు చేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

## భారత్‌లో డేటా సెంటర్ల విప్లవం..
## ఏఐతో భారీ డిమాండ్!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, ఆసియాలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న డేటా సెంటర్ మార్కెట్‌గా భారత్ అవతరిస్తోందని ప్రముఖ అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ గోల్డ్‌మన్ సాక్స్ తన తాజా నివేదికలో వెల్లడించింది. దేశంలోని యువ జనాభా, అపారమైన ఇంజినీరింగ్ నైపుణ్యం కలిగిన మానవవనరులు, ప్రభుత్వ సానుకూల విధానాలు ఈ రంగానికి మరింత ఊతమిస్తున్నాయని వివరించింది. దేశంలో ముంబై, చెన్నై నగరాలు డేటా సెంటర్లకు ప్రధాన గమ్యస్థానాలుగా మారాయి. సబ్‌మెరైన్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్ల లభ్యత ఇందుకు ప్రధాన కారణం కాగా, ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు నగరాలు కొనసాగుతున్నాయి. వీటికి తోడు పశ్చిమాసియా దేశాలకు వ్యూహాత్మకంగా చేరువలో ఉండటం కూడా భారత్‌కు కలిసొచ్చే అంశమని నివేదిక పేర్కొంది. ఈ రంగానికి సంబంధించిన తాజా గణాంకాలు కూడా ఇదే వృద్ధిని ధ్రువీకరిస్తున్నాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, దేశంలోని డేటా సెంటర్ల సామర్థ్యం గత ఏడాది చివరి నాటికి 1.6 గిగావాట్లకు చేరుకుంది. ప్రస్తుతం మరో 0.32 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్లు నిర్మాణ దశలో ఉండగా, 2.92 గిగావాట్ల సామర్థ్యం పనుల కోసం వివిధ సంస్థల మధ్య చర్చలు జరుగుతున్నాయి.

## కొండ కింద డ్రోన్ సామ్రాజ్యం..
## హెజ్బొల్లాకు భారీ షాక్ ఇచ్చిన ఇజ్రాయెల్!



ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. దక్షిణ లెబనాన్‌లోని ఓ కొండ కింద భారీ భూగర్భ డ్రోన్ కేంద్రాన్ని గుర్తించినట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. ఇరాన్ మద్దతుతో హెజ్బొల్లా ఈ కేంద్రాన్ని నిర్మించిందని ఆరోపించింది. ఇక్కడ డ్రోన్ల తయారీతో పాటు వాటిని ఇజ్రాయెల్‌పై ప్రయోగించే ఏర్పాట్లు కూడా ఉన్నట్లు వెల్లడించింది. లెబనాన్‌లోని మజ్దల్ జౌన్ గ్రామం సమీపంలో ఈ భూగర్భ కేంద్రం ఉన్నట్లు ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. ఇది దేశ సరిహద్దుకు కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇటీవల నిర్వహించిన సైనిక చర్యల్లో ఈ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్న తర్వాత సొరంగ మార్గాలు బయటపడినట్లు పేర్కొంది. సైనిక అధికారుల వివరాల ప్రకారం, ఈ సొరంగ వ్యవస్థ కొండ లోపల వందల మీటర్ల మేర విస్తరించి ఉంది. దాదాపు 29 మీటర్ల లోతులో నిర్మించిన ఈ కేంద్రానికి భారీ ఉక్కు తలుపులతో రక్షణ కల్పించారు. గతంలో గుర్తించిన హెజ్బొల్లా సొరంగాల కంటే ఇది అత్యంత ఆధునికంగా నిర్మించినట్లు ఇజ్రాయెల్ అధికారులు తెలిపారు. సొరంగం లోపల డ్రోన్ల తయారీకి ఉపయోగించే పరికరాలు, విడిభాగాలు గుర్తించినట్లు సైన్యం వెల్లడించింది. అలాగే సుమారు 50 డ్రోన్లు కూడా లభించినట్లు తెలిపింది. వాటిలో ఒక్కో డ్రోన్‌కు దాదాపు 30 కిలోల పేలుడు పదార్థం అమర్చినట్లు పేర్కొంది. ఈ డ్రోన్లు ఇజ్రాయెల్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం కలిగి ఉన్నాయని అధికారులు తెలిపారు. అంతేకాకుండా కేంద్రంలో సుమారు ఎనిమిది టన్నుల పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినట్లు వెల్లడించారు. ఈ తరహా డ్రోన్లను పూర్తిస్థాయిలో స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి అని ఇజ్రాయెల్ సైన్యం పేర్కొంది. కొండ దక్షిణ భాగంలో ప్రత్యేక డ్రోన్ ప్రయోగ మార్గాలను కూడా గుర్తించినట్లు సైన్యం తెలిపింది. అవసరమైనప్పుడు భారీ తలుపులు తెరిచి డ్రోన్లను నేరుగా ఇజ్రాయెల్ వైపు ప్రయోగించేలా ఈ వ్యవస్థను రూపొందించినట్లు వివరించింది.

# రెండో విడతలో పూరిళ్లకే అధిక ప్రాధాన్యం

-మొదటిపేజీ తరువాయి

నివసించేవారినే లక్ష్యంగా తీసుకోనుంది. అలాగే వీరికి 'షీర్?వాల్'? టెక్నాలజీ పద్ధతిలో ఇంటి నిర్మాణాన్ని చేపట్టేందుకు ఏర్పాటు చేస్తోంది.

**రాష్ట్రవ్యాప్తంగా 24వేల పూరిళ్లు**

ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. ఆ క్రమంలో పూరిళ్లలో నివసిస్తున్న వారిని గుర్తించారు. అప్పుడు ప్రాథమికంగా రాష్ట్ర వ్యాప్తంగా 24 వేల మంది పూరి గుడిసెల్లో నివసిస్తున్నట్లు తేలింది. దీంతో రెండో విడతలో గుడిసెల్లో నివసించే వారికే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. అలాగే షీర్‌వాల్ టెక్నాలజీ పద్ధతిలో ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా హౌసింగ్ కార్పొరేషన్ ప్రణాళికలు రూపొందిస్తోంది.

**నిర్మాణ వ్యయానికి చెక్!**

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పేరిట ప్రభుత్వం నాలుగు విడతలుగా రూ. 5 లక్షలను విడుదల చేస్తోంది. అయితే ప్రస్తుతం ఇటుక, సిమెంట్, ఐరన్, ఇసుక వంటి ముడి వస్తువులకు భారీగా ధరలు పెరిగిపోయాయి. దీనివల్ల ప్రభుత్వం అందించే సహాయంతో పాటు వారికి ఇంకా అదనంగా ఖర్చు అవుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పూరిళ్లలో నివసించే వారు ముందుగా డబ్బులు పెట్టి నిర్మించుకోలేరు. అందుకే ప్రభుత్వం షీర్‌వాల్ పద్ధతిలో ఇంటిని నిర్మించి ఇస్తామని అంటుంది.

**నమూనా ఇల్లు నిర్మాణం**

ఈ షీర్‌వాల్ టెక్నాలజీని ఉపయోగించి ఓ స్టార్టప్ కంపెనీ పోయిన సంవత్సరం సంగారెడ్డి జిల్లా జిన్నారంలో 400 చదరపు అడుగుల్లో నమూనా ఇంటిని చేపట్టింది. ఇది



విజయవంతంగా పూర్తి అయ్యింది. ఇటీవల కుమురం భీం జిల్లా కెరమెరి మండలం కొఠారి పంచాయతీ పరిధిలోని కొత్తగూడలో షీర్‌వాల్ పద్ధతిలోనే ఇళ్లను నిర్మించారు. పూర్తి చేసిన ఇళ్లను లబ్ధిదారులకు అందించారు.

**15 రోజుల్లోనే పూర్తి**

22.3 అడుగుల పొడవు, 18 అడుగుల వెడల్పుతో మొత్తం 400 అడుగులతో స్లాబ్ వచ్చే విధంగా సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఓ నమూనా ఇల్లు నిర్మాణం చేపట్టారు. దానికి 8ఎంఎం, 10ఎంఎం స్టీల్, రెడీమిక్స్‌డ్ సెల్ఫ్ కాంపాక్టింగ్ కాంక్రీట్, అల్యూమినియం ప్యానెల్ వినియోగించారు. ఈ పద్ధతిలో ఇల్లు నిర్మాణం కోసం మొత్తం 15 రోజుల సమయం పడుతుంది. మొదట ఐదు రోజులు పునాది వేస్తారు. ఆ తర్వాత ఆరు రోజుల పాటు శ్లాబ్? నిర్మాణం ఉంటుంది. మిగిలిన నాలుగు రోజుల్లో ప్లాస్టరింగ్? వంటి పనులను పూర్తి చేస్తారు. అయితే ఇదంతా కేవలం రూ. లక్షల్లోనే ఖర్చు అవుతుంది.

# రాష్ట్రవ్యాప్తంగా స్కూల్స్‌బంద్‌కు ఏబీవీపీ పిలుపు

విద్యాసంస్థల్లో ఫీజుల పెంపు, మౌలిక వసతుల కొరత సహా విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ జూన్? 23న ఏబీవీపీ బంద్?కు పిలుపునిచ్చింది. ఈ బంద్?కు అన్నివర్గాల వారు సహకరించాలని విద్యార్థి సంఘం నాయకులు కోరారు. కార్పొరేట్?, ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడీకి అడ్డకట్ట వేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర వ్యాప్త బంద్?కు పిలుపునివ్వడంతో ఇప్పటికే పలు ప్రైవేటు పాఠశాలలు మంగళవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ ఫోన్‌లకు మేసేజ్‌లను పంపించారు. బంద్ కారణంగా పాఠశాలకు రేపు హాలిడే ప్రకటించినట్లుగా మేసేజ్‌లో పేర్కొన్నారు.

**ఏబీవీపీ ముఖ్యమైన డిమాండ్లు ఇవే**

ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్లలో విచ్చల విడిగా ఫీజుల దోపిడీని అరికట్టేందుకు చట్టం తీసుకురావాలి.

ప్రైవేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించే విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

ఖాళీగా ఉన్న ఎంఈవో, డీఈవో పోస్టులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందిని నియామకాలు చేపట్టాలి

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించాలి.

విద్యార్థులకు వెంటనే యూనిఫార్మ్‌లు అందించాలి

రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను వెంటనే అమలు చేయాలి

ప్రైవేటు పాఠశాలల మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్, యూనిఫార్మ్ అమ్మకాలు నిషేధించాలి

ఎన్?ఈపీ 2020 అమలు చేయాలి

**విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించిన ఏఐఎస్ఎఫ్**



పాఠశాల విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ లక్డీకపూల్?లోని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ఇవాళ ఏఐఎస్ఎఫ్ ముట్టడించింది. ర్యాలీగా వచ్చిన నాయకులు కార్యాలయం ముందు బైఠాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో కార్యాలయంలోనికి వెళ్లేందుకు యత్నించిన ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు ఆందోళన కారులకు తోపులాట, వాగ్వాదం జరిగింది.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు తగ్గిస్తామని చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి సర్కారు పాఠశాలలను మరింత అభివృద్ధి చేయాలని కోరారు. తెలంగాణలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించే చర్యలు చేపట్టాలని కోరారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఒక్క ట్వీట్ మూడు రాష్ట్రాల అలర్ట్

**హైదరాబాద్ :** దేశంలోని స్పేస్-టెక్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు దక్షిణాది రాష్ట్రాల మధ్య సోషల్ మీడియా వేదికగా ఒక అపూర్వమైన వ్యూహాత్మక యుద్ధం నడుస్తోంది. ప్రముఖ అంతరిక్ష సాంకేతిక స్టార్టప్ పిక్సెల్ కో-ఫౌండర్ క్షితిజ్ ఖండేల్వాల్ చేసిన ఒకే ఒక్క పోస్ట్.. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల పారిశ్రామిక మంత్రుల మధ్య హైవోల్టేజ్ పోటీకి తెరలేపింది. బెంగళూరు శివార్లలో తమ ఉపగ్రహాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి భూమిని సేకరించడం ఎంత నరకంగా మారిందో వివరిస్తూ పిక్సెల్ కో-ఫౌండర్ క్షితిజ్ ఖండేల్వాల్ ఎక్స్ లో ఒక పోస్ట్ పెట్టారు. భూమిని సేకరించడం కంటే.. అసలు అంతరిక్షంలోకి వెళ్లే ఉపగ్రహాలను తయారు చేయడమే చాలా సులభం అనిపిస్తోంది అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. బెంగళూరు లాంటి గ్లోబల్ టెక్ హబ్‌లో భూసేకరణ, అనుమతుల ప్రక్రియల్లో ఉన్న రెడ్-ట్యాపిజం ను ఈ ట్వీట్ ఎత్తిచూపడంతో పొరుగు రాష్ట్రాలు దీనిని ఒక అద్భుతమైన అవకాశంగా మార్చుకున్నాయి. ఈ పోస్టుపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి నారా లోకేష్ అత్యంత వేగంగా స్పందించారు. "క్షితిజ్.. బెంగళూరుకు సరిగ్గా ఆనుకుని, ఇన్వెస్టర్లకు స్వర్గధామం లాంటి అనంతపురం జిల్లా మన పక్కనే ఉంది. అక్కడ మేము స్పేస్ సిటీలు, ఏరోస్పేస్ పార్కులు, రెడీ-టు-గో ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్స్‌ను సిద్ధం చేస్తున్నాం. ఫౌండర్లు భూమి కోసం వేటాడుతూ సమయం వృథా చేసుకోకుండా నేరుగా ఉపగ్రహాల తయారీపై దృష్టి పెట్టవచ్చు. వెల్‌కమ్ టు ఏపీ" అంటూ లోకేష్ బంపర్ ఆఫర్ ఇచ్చారు. దీనికి మద్దతుగా ఏపీ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ కూడా కర్ణాటకను టార్గెట్ చేస్తూ.. "కొన్ని ఎకోసిస్టమ్స్ మిమ్మల్ని అనుమతుల కోసం ఆఫీసుల చుట్టూ పరిగెత్తేలా చేస్తాయి.. కానీ ఆంధ్రప్రదేశ్ మీకు నేరుగా లాంచ్ ప్యాడ్ అందిస్తుంది" అంటూ హాట్ కామెంట్స్ జోడించింది. సొంత రాష్ట్రంలోని స్టార్టప్ పొరుగు రాష్ట్రానికి తరలిపోయే ప్రమాదం ఉందని గ్రహించిన కర్ణాటక భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెంటనే రంగంలోకి దిగారు. క్షితిజ్ పోస్టుకు రిప్లై ఇస్తూ.. "నా ఆఫీస్ మరియు అధికారులు తక్షణమే మీతో టచ్‌లోకి వస్తారు. మీ సమస్యలను వ్యక్తిగతంగా సమీక్షించి, భూసేకరణ మరియు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తాం" అని హామీ ఇచ్చారు. బెంగళూరు సిలికాన్ వ్యాలీ ట్యాగ్‌ను కాపాడుకునేందుకు కర్ణాటక ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించింది. ఈ బెంగళూరు-ఆంధ్ర వివాదంలోకి తమిళనాడు పరిశ్రమల శాఖ మంత్రి కీర్తన అనూహ్యంగా ప్రవేశించారు. హోసూర్ సరిహద్దులో ఉన్న తమిళనాడు ఎందుకు ఈ ప్రాజెక్ట్‌ను దక్కించుకోకూడదని నెటిజన్లు ప్రశ్నించడంతో ఆమె అత్యంత హుందాగా, పవర్‌ఫుల్ కౌంటర్ ఇచ్చారు. తాము గైడెన్స్ తమిళనాడు సింగిల్ విండో సిస్టమ్ ద్వారా పనిచేస్తామని స్పష్టం చేశారు. ఇన్వెస్టర్ వెబ్‌సైట్, ఎక్స్, లింక్డ్‌ఇన్, ఈమెయిల్ లేదా కేవలం ఒక చిన్న రెఫరల్.. ఇలా ఏ మార్గంలో క్వెరీ పంపినా, చిన్న ఎంట్రప్రెన్యూర్‌ను కూడా సమానంగా, అత్యంత సీరియస్‌గా తీసుకుంటామని చెప్పారు. భారతదేశంలో ఒకప్పుడు పెట్టుబడుల కోసం ఫౌండర్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. కానీ ఈరోజు, ఒక స్టార్టప్ ఫౌండర్ పెట్టిన చిన్న అసంతృప్తి ట్వీట్‌కు ముగ్గురు రాష్ట్రాల మంత్రులు పోటీ పడి మరీ నిమిషాల వ్యవధిలో పరిష్కారాలు చూపడం భారతీయ స్టార్టప్ ఎకోసిస్టమ్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పుకు నిదర్శనం. ల్యాండ్ అక్విజిషన్ , రెడ్-ట్యాపిజం వంటి పాత కాలపు అడ్డంకులను తొలగించి, ఇన్వెస్టర్లకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కల్పించడంలో దక్షిణాది రాష్ట్రాల మధ్య సాగుతున్న ఈ ఆరోగ్యకరమైన పోటీ దేశ ఆర్థిక వృద్ధిని మరింత వేగవంతం చేస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నఅభిప్రాయం వ్యక్తమవుతోంది.



## సన్నాలకే పెద్దపీట

-మొదటిపేజీ తరువాయి

4 కేజీల తరుగును తీస్తున్నారు. వీటిని గుర్తించిన ప్రభుత్వం ఏడు రకాల సన్నాలనే పండించాలని రైతులకు సూచిస్తోంది. రైతు వేదికల్లో ఈ నెల 23 నుంచి విత్తన మేళాలను నిర్వహించి, వాటి ప్రయోజనాలపై అన్నదాతలకు విస్తృత ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. వీటికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు (ఎంఎస్?పీ) అదనంగా రూ.500 బోనస్?ను చెల్లించాలని భావిస్తోంది. ఆ 7 రకాలు ఇవే :

తెలంగాణ సోన రకం (ఆర్ఎన్ఆర్-15048) : పంట కాలం వ్యవధి 120నుంచి 125రోజులు ఉంటుంది. ఇవి బ్లాస్ట్ వ్యధిని తట్టుకోగలిగే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. హెడ్ రైస్ రికవరీ 67 శాతంపైనే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సాంబ మసూరి రకం (బీపీటీ-5204) : ఈ పంట కాలపరిమితి 145 నుంచి 150 రోజులు ఉంటుంది. సుగంధభరితమైన ధాన్యం గింజ. ఎగుమతులకు అనుకూలంగా ఉంటుంది.

కేఎన్ఎం (1638) : కేఎన్?ఎం పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు ఉంటుంది. వ్యాధులను తట్టుకొనగలిగే శక్తి ఉంటుంది.

హెచ్ఎంటీ సోన : ఈ పంట కాలపరిమితి 135 నుంచి 145 రోజులు ఉంటుంది. సూపర్ ఫైన్ రకం తెల్లని గింజ. అద్భుతమైన రుచి. మార్కెట్‌లో ఈ రకం ధాన్యానికి మంచి డిమాండ్ ఉంది.

జైశ్రీరాం : ఈ రకం పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు. అధిక దిగుబడినిస్తుంది. వర్షాకాలం, యాసంగి సీజన్‌లో సాగుకు అనుకూలం.

వీజీఎల్-44 : వీజీఎల్ పంట కాలవ్యవధి 130 నుంచి 145 రోజులు ఉంటుంది. స్థిరమైన దిగుబడి. అన్నిరకాల నేలలకు అనుకూలం.

కేఎన్ఎం (7715) : ఈ పంట కాలపరిమితి 125 నుంచి 130 రోజులు. సూపర్ ఫైన్ రకం. మార్కెట్‌లో వీటిని మంచి డిమాండ్ ఉంది. సాగులోనూ స్థిరత్వం ఉంటుంది.

సన్నాలకే పెద్దపీట : ఎల్‌నినో నేపథ్యంలో క్రయవిక్రయాలు, ఎగుమతులు, వినియోగ అవసరాల నిమిత్తం తెలంగాణ రాష్ట్రంలో వరి సాగులో సన్నాలకే పెద్దపీట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వానాకాలం సీజన్‌లో 1.34 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు చేయాలని వ్యవసాయశాఖ భావించగా ఇందులో 69 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుందని ప్రాథమికంగా అంచనా వేసింది. వాటిల్లో 7 సన్న రకాలనే 38.19 లక్షల ఎకరాల్లో సాగు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ 7 రకాలే గత సీజన్‌లో 27.88 లక్షల ఎకరాల్లో సాగయ్యాయి. నిరుటి కంటే 10.31 లక్షల పెంచి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. బోనస్ వర్తింపు, సాగు విస్తీర్ణం పెంపుదల, పంపిణీ, సబ్సిడీ, విత్తనాల లభ్యత, తదితర అంశాలను వ్యవసాయ శాఖ మంత్రిమండలి ఆమోదానికి సమర్పించింది. ముందు పూర్తి ధర చెల్లించాలి : రైతన్నలు కొనుగోలు చేసిన విత్తనాలకు ముందుగా పూర్తి ధరను చెల్లించాల్సి ఉంటుంది. పంట కాలం ముగిసేంత వరకు బిల్లును భద్రపరచుకోవాల్సి ఉంటుంది. వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈవో) ఆ రైతు పొలాన్ని సందర్శించి, కొనుగోలు చేసినటువంటి విత్తనాలనే పంట సాగుకు ఉపయోగించారని ధ్రువీకరిస్తారు. అప్పుడు విత్తన సబ్సిడీ రైతుల అకౌంట్లలో పడుతుంది.

## నీటి వాటాపై రాజీపడే ప్రసక్తే లేదు

-మొదటిపేజీ తరువాయి

కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్డీఎస్ కింద తెలంగాణకు చట్టబద్ధంగా కేటాయించిన నీటి వాటా విషయంలో ఎవరితోనూ రాజీపడే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని తెలంగాణ రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తుంగభద్ర జలాల వినియోగంలో ఎగువ రాష్ట్రాలు (కర్ణాటక, ఏపీ) తీసుకునే ఏకపక్ష నిర్ణయాల వల్ల తెలంగాణ రైతులకు నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. ట్రైబ్యునళ్లు, కృష్ణా నదీ యాజమాన్య బోర్డు, అంతర్రాష్ట్ర సమావేశాల వేదికగా తెలంగాణ హక్కులను చాలా బలంగా వినిపించాలని స్పష్టం చేశారు. కృష్ణా పరీవాహక ప్రాంత రైతుల సాగునీటి అవసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశిస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా తీవ్రంగా వ్యతిరేకిస్తామన్నారు. ఈ అంతర్రాష్ట్ర జల వివాదాలపై చట్టపరమైన, సాంకేతిక, పరిపాలనా అంశాలతో కూడిన ఒక సమగ్ర నివేదికను వెంటనే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

## స్థానికతపై ద్వంద్వ విధానం తగదు..



**హైదరాబాద్ :** ఉద్యోగ నియామకాల్లో అభ్యర్థుల స్థానికత నిర్ధారణ కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) అమలు చేస్తున్న విధానాన్ని హైకోర్టు తప్పుపట్టింది. టీజీపీఎస్సీ ద్వంద్వ విధానాన్ని అమలు చేస్తున్నదని తేల్చింది. ఒక సందర్భంలో అర్హత పరీక్షకు ముందు వరుసగా నాలుగేండ్లు తెలంగాణలో చదువలేదన్న కారణంతో అభ్యర్థిని స్థానికుడిగా గుర్తించలేదని, మరో సందర్భంలో 1 నుంచి 7వ తరగతి వరకు తెలంగాణ వెలుపల చదివారనే కారణంతో స్థానికతను నిరాకరించిందని పేర్కొంటూ.. ఇది సరైన విధానం కాదని స్పష్టం చేసింది. స్థానికత నిర్ధారణకు చట్టబద్ధంగా నిర్దేశించిన మార్గదర్శకాలను అనుసరించడంలో టీజీపీఎస్సీ విఫలమైందని ఆక్షేపించింది. రాష్ట్రపతి ఉత్తర్వులు-2018లోని పేరా-7లో పేర్కొన్న నిబంధనలను విడివిడిగా కాకుండా సమగ్రంగా చదువాలని, వాటికి సంబంధించిన వ్యాఖ్యానాలను కూడా పరిగణనలోకి తీసుకుని సమిష్టిగా అమలు చేయాలని పేర్కొన్నది. స్థానికత విషయంలో రాజ్యాంగబద్ధ సంస్థగా టీజీపీఎస్సీ స్థిరమైన, ఒకే తరహా ప్రమాణాలను పాటించాలని ఆదేశించింది. 2022 అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ) నియామకాల వ్యవహారంలో పీ నిశాంత్ అనే అభ్యర్థిని స్థానికుడిగా పరిగణించాలన్న సింగిల్ జడ్జి తీర్పుపై టీజీపీఎస్సీ దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసింది. ఈ మేరకు జస్టిస్ పీ శ్యాంకోశీ, జస్టిస్ నందికొండ నర్సింగరావు ధర్మాసనం తీర్పు వెలువరించింది.

## వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తాం



-మొదటిపేజీ తరువాయి

మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతో దాదాపు 20 నిమిషాల పాటు పలు అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించిన రక్షణభూములు బదలాయించినందుకు రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశమైనందువల్ల ఆదిలాబాద్‌లో వాయుసేన విమానాశ్రయానికి సహకరిస్తామని రక్షణ మంత్రి హామీ ఇచ్చారు. వాయుసేన టెర్మినల్‌తోపాటు కార్గో, హ్యాంగర్, ఎమ్ఆర్‌వో సౌకర్యాలు కల్పించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. హ్యాంగర్స్ ఏర్పాటుకు ఆదిలాబాద్ విమానాశ్రయం అనుకూలంగా ఉంటుందని తెలిపారు. దేవరకద్ర సమీపంలో డీఆర్‌డీవో ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని ఆయన కోరారు.

# స్వయం ఉపాధి, జీవనోపాధి కార్యక్రమాల అమలులో వేగం పెంచాలి






- సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్
- లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా చర్యలు
- ఆదివాసీ, పీవీటీజీ కుటుంబాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మన భద్రాద్రి న్యూస్, జూన్ 22**

గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రత్యేక జీవనోపాధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం, తెలంగాణ సామాజిక అభ్యున్నతి కార్యక్రమం అమలు పురోగతిపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఐడీఓసీ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్య దేవరాజన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన లబ్ధిదారులకు జీవనోపాధి అవకాశాల కల్పన, ఉత్పాదక ఆస్తుల పంపిణీ, గ్రామస్థాయిలో కార్యక్రమాల అమలు వేగవంతం చేయాలని సూచించారు. జిల్లా అధికారులు నిరంతర పర్యవేక్షణతో నిర్దేశిత గడువులో లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారుల కుటుంబాలకు ఆధార్ నమోదు, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు, రేషన్ కార్డులు, గృహాల మంజూరు, ఆరోగ్య సేవలు, టీకా కార్యక్రమాలు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు సకాలంలో అందేలా ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్లు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేయాలని పేర్కొన్నారు. వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన శాఖలతో సమన్వయం పెంచి కుటుంబాలకు బహుళ జీవనోపాధి అవకాశాలు కల్పించాలని, పశువైద్య శిబిరాలు, పోషకాహార తోటలు, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలను విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. అలాగే ఇప్పపువ్వు, తేనె సేకరణ, తేనెటీగల పెంపకం, వెదురు సాగు వంటి అటవీ ఆధారిత జీవనోపాధి కార్యక్రమాలను ప్రోత్సహించి ఆదివాసీ కుటుంబాల ఆదాయాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఆదివాసీ, పీవీటీజీ (అత్యంత వెనుకబడిన గిరిజన) కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానం చేసి ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో తెలంగాణ సమగ్ర జీవనోపాధి కార్యక్రమం కింద గుండాల మండలంలో 800, దుమ్ముగూడెం మండలంలో 800, పినపాక మండలంలో 865, చర్ల మండలంలో 865 కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. ఆయా కుటుంబాలకు జీవనోపాధి అవకాశాలు, సంక్షేమ పథకాల అనుసంధానం, మౌలిక సదుపాయాల కల్ప కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ విద్యాచందన, ఏపీఎం వెంకయ్యతో పాటు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

## భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట






**భద్రాచలం, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ప్రతి వినతిపత్రాన్ని సత్వరమే పరిష్కరించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట ఆదేశించారు. సోమవారం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారుల సమక్షంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత శాఖలకు పంపిస్తూ, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, భూ సమస్యలు, వ్యక్తిగత సమస్యలు, పింఛన్లు, నిరుద్యోగులకు సంబంధించిన అంశాలు, వివిధ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి సంబంధిత డివిజన్ అధికారులకు పంపించినట్లు సబ్ కలెక్టర్ తెలిపారు. ప్రతి ఫిర్యాదుపై శాఖాధిపతులు వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేపట్టి, నిర్ణీత గడువులోగా పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ప్రజావాణి ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం తహసీల్దార్ తోట రవికుమార్, ఆర్ అండ్ బి డీఈ సతీష్, భద్రాచలం డివిజన్ పరిధిలోని వివిధ శాఖల డివిజన్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పురం బిక్షం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు





**మణుగూరు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

మణుగూరు మండలం, రామానుజవరం గ్రామానికి చెందిన పురం బిక్షం మృతి చెందిన విషయం తెలుసుకున్న పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పురం బిక్షం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఎమ్మెల్యే, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, గుండగాని నాగేశ్వరరావు, తమ్మిశెట్టి సాంబ, సాదిని సీతయ్య, తాతా వీరయ్య, కట్ట నరసయ్య, దేగల కృష్ణారావు, కొడారి రాణి, ఆకుల నరసింహారావు, రాసమల్ల నాగరాజు, బి. భద్రయ్య, బొల్లం రాజేష్, ఎన్. ముత్తయ్య, అప్పయ్య, సాదిని గోవర్ధన్, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లెలమడుగు గ్రామాభివృద్ధి కోసం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం



**మణుగూరు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

అశ్వాపురం మండలం, మల్లెలమడుగు గ్రామపంచాయతీ అభివృద్ధికి సంబంధించిన పలు సమస్యల పరిష్కారం కోసం గ్రామ సర్పంచ్ మచ్చా నరసింహారావు ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజలకు అవసరమైన సౌకర్యాల విస్తరణతో పాటు పెండింగ్‌లో ఉన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేసి పనులను త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవుల రవి, తూము రాఘవులు, బచ్చు వెంకటరమణ, బేతం రామకృష్ణ, బారాజు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రామానుజవరం గ్రామాభివృద్ధి కోసం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం



**మణుగూరు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

మణుగూరు మండలం, రామానుజవరం గ్రామపంచాయతీలో నెలకొన్న పలు ప్రజా సమస్యల పరిష్కారం కోసం గ్రామ ఉపసర్పంచ్ కొడారి రాణి ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సరఫరా, రహదారుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టి గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యురాలు సుస్మిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ్మిశెట్టి సాంబ, కట్ట నర్సింహా, సీతయ్య, ఆకుల నర్సింహారావు, దేగల కృష్ణారావు, పల్లపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

## – ఐటీడీఏ పీవో బి. రాహుల్



**భద్రాచలం, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌కు తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చిన వికలాంగులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆప్యాయంగా పలకరించి వారి వినతిపత్రాలను స్వీకరించారు. తన ఛాంబర్ నుంచి గిరిజన దర్బార్‌కు వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన వికలాంగులను గమనించిన పీవో వెంటనే స్పందించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారి దరఖాస్తులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ, సమస్యలను అత్యవసరంగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో సూచించారు.

# రైతులకు ఇబ్బందికరంగా ఉన్న యూరియా యాప్ ను తక్షణమే రద్దుచేయాలి

- రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాసా రోశయ్య, సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు
- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో జూలూరుపాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా
- బ్లాక్ మార్కెట్ ను ప్రోత్సహించే ఉద్దేశంతో యూరియా యాప్ ను ప్రవేశపెట్టారు

**జూలూరుపాడు, మన భద్రాద్రి న్యూస్, జూన్ 22**

జూలూరుపాడు రైతులకు ఇబ్బందికరంగా ఉన్న యూరియా యాప్ ను తక్షణమే రద్దుచేసి, పాత పద్ధతిలో రైతులకు యూరియా అందజేయాలని డిమాండ్ చేస్తూ జూలూరుపాడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి యాస రోశయ్య సీపీఐ మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రస్తుతం సాగు ప్రారంభమైన తరుణంలో అటు కేంద్ర ప్రభుత్వం ఇటు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ఉదాసీన వైఖరి వల్ల సాగువేయం భారమై రైతంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయారని, పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోయిన తరుణంలో పండిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు లేక రైతాంగం దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా పెంచిన ఎరువుల ధరలను డీజిల్ మరియు పెట్రోల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంట రుణమాఫీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, ముఖ్యంగా రెండు లక్షల రూపాయలు పైగా ఉన్న పంట రుణాలను పూర్తిస్థాయిలో మాఫీ చేసి రైతులకు కొత్త రుణాలు ఇవ్వాలని, మార్కెట్లో నకిలీ విత్తనాలు, నాణ్యత లేని నకిలీ పురుగు మందులు అమ్ముతూ అన్నదాతల జీవితాలతో ఆడుకుంటున్న వ్యాపారులపై పి.డి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహసిల్దార్ కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, రైతు సంఘం నాయకులు యాలంకీ మధు, ఎస్.కె నాగుల్ మీరా, సిరిపురపు వెంకటేశ్వర్లు తూము కోటయ్య పొనేకంటి వెంకటేశ్వర్లు ఊ దల సుధా చెరుకుమల్ల రాజేశ్వరరావు, ఎస్.కె చాంద్ పాషా చీమకుర్తి సంతోష్ పసుపులేటి పవన్ చీమకుర్తి భాస్కర్ వెంకటేశ్వర్లు సురేష్ గోపి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# సీతమ్మసాగర్ పేరు చెప్పి గోదావరి తల్లి గర్భాన్ని గుల్ల చేస్తున్నారు : కుడుముల లక్ష్మీనారాయణ

- ఎకో సెన్సిటివ్ జోన్ గిరిజనులకు శాపం.. ఇసుక మాఫియాకు వరమా? అని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకుడు

**మంగపేట, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

సీతమ్మసాగర్ ప్రాజెక్టు పేరును అడ్డుపెట్టుకుని గోదావరి నదిలో భారీ స్థాయిలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ మంగపేట మండల మాజీ అధ్యక్షుడు, జిల్లా సీనియర్ నాయకుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ములుగు జిల్లా మంగపేట మండలంలోని గంపోనిగూడెం సమీపంలో పొదుమూరు రెవెన్యూ పరిధిలోని పట్టా భూముల్లో ఇసుక మేటలు ఉన్నాయని తప్పుడు నివేదికలు సృష్టించి, రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్, భూగర్భ జలాలు, ఇరిగేషన్ శాఖల నుంచి అనుమతులు పొందారని ఆరోపించారు. అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు కాంట్రాక్టర్లు గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని విమర్శించారు. దొంగలవార్రె ప్రాంతంలో గోదావరిలో భారీ రహదారి నిర్మించి, జేసీబీలు, పోక్లెయిన్లతో 24 గంటలపాటు ఇసుక తవ్వుతూ వందలాది లారీల ద్వారా తరలిస్తున్నారని తెలిపారు. కోట్ల రూపాయల విలువైన ప్రజా సంపదను అక్రమంగా తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, దీనిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.



గతంలో ఇదే ప్రాంతంలో గంపోనిగూడెం గిరిజన సహకార సంఘం ఇసుక క్వారీ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఎకో సెన్సిటివ్ జోన్ అని అనుమతి నిరాకరించిన అధికారులు, ఇప్పుడు అదే ప్రాంతంలోని పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు ఎలా అనుమతులు ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ఒక న్యాయం, ఇసుక మాఫియాకు మరో న్యాయమా అని ప్రశ్నించారు.

ఆర్టీఐ ద్వారా ప్రభుత్వమే అందించిన సమాచారం ప్రకారం మంగపేట మండలంలోని ఏ గ్రామమూ సీతమ్మసాగర్ ముంపు పరిధిలో లేదని తెలిపారు. అలాగే జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు 2023 మార్చి 24 నుంచి సీతమ్మసాగర్ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని గుర్తుచేశారు. అలాంటప్పుడు డి-సిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని ఆరోపించారు.

ఈ అక్రమ ఇసుక తవ్వకాల వెనుక ఉన్న అధికార పార్టీ నేతలను ప్రభుత్వం బహిర్గతం చేయాలని, లేకపోతే వెంటనే అక్రమ క్వారీలను మూసివేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కుడుముల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. అవసరమైతే ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, మల్లూరు దేవస్థానం మాజీ చైర్మన్ నూతలకంటి ముకుందం, ములుగు జిల్లా నాయకులు పుప్ప వెంకట్ రెడ్డి, ఊడుగుల శ్రీనివాస్ యాదవ్, పార్టీ నాయకులు చల్లగురుగుల తిరుపతి, టైలర్ వెంకట్ రెడ్డి, యూత్ నాయకులు పిల్లలమర్రి వేణు, లంజపెల్లి లక్ష్మణ్, గౌని రమేష్, గడ్డి సునీల్, సోషల్ మీడియా వారియర్స్ వీసా సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి -- జిల్లా కలెక్టర్ అంకిత్

- రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని అధికారులకు ఆదేశం

**బూర్గంపాడు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పోషకాహారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం బూర్గంపాడు మండలంలో ఆకస్మికంగా పర్యటించిన ఆయన పలు విద్యా, వ్యవసాయ సంస్థలను తనిఖీ చేశారు. మొదట తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలను సందర్శించిన కలెక్టర్ కిచెన్ షెడ్, స్టోర్ రూమ్, తరగతి గదులు, వసతి గృహాలను పరిశీలించారు. వంటశాల, భోజనశాల పరిసరాల్లో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మెనూ చార్ట్‌ను పరిశీలించి విద్యార్థులకు నిర్దేశిత మెనూ ప్రకారమే ఆహారం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.



స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, నిత్యావసర సరుకులు, కూరగాయల నాణ్యతను తనిఖీ చేసిన కలెక్టర్, ఎప్పటికప్పుడు తాజా కూరగాయలను మాత్రమే వినియోగించాలని, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వొద్దని స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్య, వసతి, భోజనం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థుల చేరికలు, హాజరు శాతం, బోధన కార్యక్రమాలపై ఉపాధ్యాయులు, పాఠశాల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించి, విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలి

అనంతరం మోరంపల్లి బంజర గ్రామంలోని శ్రీ లక్ష్మీ గణపతి ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు తగినంతగా అందుబాటులో ఉన్నాయా లేదా అని వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. దుకాణంలోని పత్తి విత్తనాలు, వివిధ రకాల ఎరువులు, పురుగుమందుల నిల్వలను తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. గోదాములో నిల్వ ఉంచిన యూరియా బస్తాలను పరిశీలించి నిల్వల పరిస్థితిని సమీక్షించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని డీలర్లకు సూచించారు. రైతులకు నాణ్యమైన వ్యవసాయ ఇన్‌పుట్లు అందించడంలో నిర్లక్ష్యం ఉండరాదని, స్టాక్ రిజిస్టర్లను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ నిల్వలు, విక్రయాల వివరాలను పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించారు.
వ్యవసాయ సీజన్‌లో ఎరువుల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా వ్యవసాయ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనలు జరిగితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు తహసీల్దార్ కె.ఆర్.కె.వి. ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సమ్మయ్య, ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ నాగజ్యోతి, వ్యవసాయ శాఖ అధికారి శంకర్, హౌసింగ్ ఏడీ, జీపీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కమలాపురంలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ





**ములకలపల్లి, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

ములకలపల్లి మండలం, కమలాపురం గ్రామంలో అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సోమవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మొదటి విడతలో పూర్తయిన ఎనిమిది ఇందిరమ్మ ఇళ్లను ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న గడ్డం రాజును, నడుము విరిగి మంచానికే పరిమితమైన మడివి రాజును పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మడివి రాజును హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించి అవసరమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మాట్లాడుతూ, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో గుడిసెలు, గడ్డి ఇళ్లలో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమలాపురం సర్పంచ్ వగ్గెల రాధ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జహీరుద్దీన్, కాంగ్రెస్ నాయకులు బత్తుల అంజి, తాండ్ర ప్రభాకరరావు, బాల అప్పారావు, పువ్వాల మంగపతి, పర్వతనేని అమర్నాథ్, కరుటూరి కృష్ణ, శనగపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎంఆర్ఎస్ బూర్గంపహాడ్ బాలికల పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ అంకిత్





**బూర్గంపహాడ్, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, కలెక్టర్ అంకిత్, ఐఏఎస్ సోమవారం టీజీఎంఆర్ఎస్ బూర్గంపహాడ్ బాలికల పాఠశాలను సందర్శించి పాఠశాల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, సిక్ రూమ్, ప్రొవిజన్స్ రూమ్, వంటగదిని తనిఖీ చేసిన కలెక్టర్, పాఠశాలలో నిర్వహణ, పరిశుభ్రత, క్రమశిక్షణ మరియు ఉన్నత ప్రమాణాలను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో సమావేశమై వారి విధి నిర్వహణ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని ప్రశంసించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి పి.వి. గీతా జ్యోతి నాయకత్వంలో పాఠశాల అత్యుత్తమంగా నిర్వహించబడుతుండటంపై ప్రత్యేక అభినందనలు తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, పరిశుభ్రమైన వాతావరణం, క్రమశిక్షణ ఇతర విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది ఇదే నిబద్ధతతో పనిచేస్తూ విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.

# కస్తూరిబా పాఠశాలలో తాత్కాలిక లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**బూర్గంపహాడ్, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో తాత్కాలిక ప్రాతిపదికన పీజీసీఆర్టీ (సివిక్స్) లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉన్నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి సుశీల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు ఎం.ఏ. పొలిటికల్ సైన్స్ విద్యార్హత కలిగి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా స్థానికులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత ఒరిజినల్ విద్యార్హత పత్రాలతో స్వయంగా కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయానికి హాజరై దరఖాస్తు సమర్పించాలని సూచించారుఅభ్యర్థుల ఎంపిక పూర్తిగా విద్యార్హతల మెరిట్ ఆధారంగా నిర్వహించబడుతుందని ప్రత్యేక అధికారి సుశీల తెలిపారు.జ

మంగళవారం 23 జూన్ 2026
మన భద్రాద్రి

# సీతమ్మ సాగర్ పేరుతో గోదావరి ఇసుక దోపిడీ జరుగుతోంది

- **బీఆర్ఎస్ నేత కుడుముల లక్ష్మీనారాయణ**



**మంగపేట, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పేరుతో డి–సిల్టేషన్ ముసుగులో గోదావరి నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ పార్టీ మంగపేట మండల మాజీ అధ్యక్షుడు, జిల్లా సీనియర్ నాయకుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆరోపించారు. సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంగపేట మండలం గంపోనిగూడెం––పొదుమూరు రెవెన్యూ పరిధిలోని పట్టా భూముల్లో ఇసుక మేటలు ఉన్నట్లు తప్పుడు నివేదికలు సృష్టించి, సంబంధిత శాఖల నుంచి అనుమతులు పొందిన అనంతరం సీతమ్మ సాగర్ డి–సిల్టేషన్ పేరుతో నది గోదావరిలో భారీ ఎత్తున ఇసుక తవ్వకాలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. దొంగలఒర్రె ప్రాంతంలో గోదావరిలో రోడ్డు నిర్మించి, జేసీబీలు, పొక్లెయిన్లతో 24 గంటల పాటు ఇసుకను తవ్వి వందలాది లారీల్లో తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ అక్రమ తవ్వకాలు అధికారుల కళ్లముందే జరుగుతున్నా వారు మౌనంగా ఉండటం అనుమానాలకు తావిస్తోందని అన్నారు.

గిరిజన సహకార సంఘం ఇసుక క్వారీకి దరఖాస్తు చేసినప్పుడు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో అనుమతి నిరాకరించిన అధికారులు, అదే ప్రాంతంలోని పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు ఎలా అనుమతులు ఇచ్చారని ప్రశ్నించారు. ఆర్టీఐ ద్వారా అందిన సమాచారం ప్రకారం మంగపేట మండలంలోని ఏ గ్రామమూ సీతమ్మ సాగర్ ప్రాజెక్టు ముంపు పరిధిలో లేదని, అలాగే జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాల మేరకు 2023 మార్చి 24 నుంచే ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల్లో డి–సిల్టేషన్ పేరుతో ఇసుక తవ్వకాలు చేయడం పూర్తిగా చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.

ఇసుక మాఫియా వెనుక ఉన్న అధికార పార్టీ నాయకులు ఎవరో ప్రభుత్వం వెల్లడించాలని, లేకుంటే అక్రమ క్వారీలను వెంటనే మూసివేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రభుత్వానికి సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, మల్లూరు దేవస్థానం మాజీ చైర్మన్ నూతలకంటి ముకుందం, జిల్లా నాయకులు పుష్ప వెంకట్ రెడ్డి, ఊడుగుల శ్రీనివాస్ యాదవ్, చల్ల గురుకుల తిరుపతి, టైలర్ వెంకట్ రెడ్డి, పిల్లలమర్రి వేణు, లంజపల్లి లక్ష్మణ్, గౌని రమేష్, గడ్డి సునీల్, సోషల్ మీడియా వారియర్స్ బీసీ సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట ప్రధాన రహదారి డివైడర్‌పై మొక్కలు నాటనున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ



**దమ్మపేట, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

దమ్మపేట పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రధాన రహదారి డివైడర్‌పై మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఈనెల 23వ తేదీ మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి––రాంబాబు, పంచాయతీ కార్యదర్శి బండి అనంత్ కుమార్ తెలిపారు. సుమారు రెండు కిలోమీటర్ల పొడవునా ప్రధాన రహదారి డివైడర్‌పై మొక్కలు నాటడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు దోహదపడు తుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎంపీడీవో రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీ గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకులు ప్రేమ్ సుస్థిర గురూజీ ఆహ్వానం మేరకు ఆశ్రమాన్ని సందర్శించిన పాలకవర్గ సభ్యులు, అనంతరం ప్రధాన రహదారి డివైడర్‌పై మొక్కలు నాటేందుకు గోతులు తీయించారు. ఇటీవల ఇదే డివైడర్‌పై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎండాకాలం కారణంగా మొక్కల నాటే కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసిన అధికారులు, ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభం కావడం మరియు రాష్ట్రవ్యాప్తంగా వన మహోత్సవం జరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, చాట్ల శ్రీనివాసరావు, రూపా రాంబాబు, బత్తుల సాయి, ఉయ్యాల లక్ష్మీనారాయణ, దాసరోజు సరిత––రామారావు, పసుమర్తి కుసుమాంబ, బద్దె వెంకటలీల––రాంబాబు, పూనెం పోలమ్మ, షేక్ గోరె, చిన్నశెట్టి నాగలక్ష్మి – ముక్తేశ్వరరావు, గ్రామస్తులు చిన్నశెట్టి గోపి, రొయ్యల కుమార్, సిబ్బంది వెంకటేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరించిన ఐటీడీఏ పీవో బి. రాహుల్





**గిరిజనుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు సుకోవాలని అధికారులకు ఆదేశం**

**భద్రాచలం, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ గిరిజనుల నుంచి వినతిపత్రాలను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి (జనరల్) డేవిడ్ రాజ్, ఎస్‌డీసీ ట్రైబల్ వెల్ఫేర్ ఆనంద్‌కుమార్, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ చందన, గురుకుల ఆర్‌సీఓ అరుణకుమారి, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ మధుకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గిరిజన ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి, మౌలిక వసతులు, విద్య, వైద్యం తదితర అంశాలకు సంబంధించిన వినతులను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి దరఖాస్తును పరిశీలించిన పీవో, సమస్యల స్వభావాన్ని బట్టి సంబంధిత శాఖల అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో బి. రాహుల్ మాట్లాడుతూ గిరిజన ప్రజలకు సత్వర, పారదర్శక సేవలు అందించడమే ఐటీడీఏ ప్రధాన లక్ష్యమన్నారు. గిరిజన దర్బార్‌లో అందిన ప్రతి వినతిని అత్యంత ప్రాధాన్యంతో పరిగణించి, సమస్యల పరిష్కారానికి శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సమస్యలను కేవలం నమోదు చేయడమే కాకుండా, వాటి పరిష్కారానికి నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని తెలిపారు. శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే గిరిజనుల సమస్యల పరిష్కారం వేగవంతమవుతుందని పేర్కొన్న ఆయన, ఎలాంటి జాప్యం లేదా నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా వెంటనే పరిష్కరించగల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, మిగిలిన వాటిని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. వినతిపత్రాలతో పాటు సంబంధిత ఆధార పత్రాలు సమర్పిస్తే సమస్యల పరిష్కారం మరింత సులభతరం అవుతుందని తెలిపారు. ఈ గిరిజన దర్బార్‌లో పోడు భూముల పట్టాలు, పేరుమార్పులు, రైతు భరోసా, భూ సమస్యలు, వ్యవసాయ బోర్లు, విద్యుత్ మోటార్లు, తాగునీటి సౌకర్యం, మత్స్యకార సంఘాల ఏర్పాటు, దీర్ఘకాలిక వ్యాధుల వైద్య సహాయం, స్వయం ఉపాధి శిక్షణలు, ఆర్థిక సహాయం, గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు, సోలార్ విద్యుత్, బోర్లు తవ్వుకునేందుకు అనుమతులు తదితర అంశాలపై గిరిజనులు వినతులు సమర్పించినట్లు పీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి ఉదయ్ కుమార్, కొండరెడ్డి అభివృద్ధి అధికారి గన్యా, ఏడీఎంహెచ్‌వో సైదులు, ఏపీవో పవర్ వేణు, మిషన్ భగీరథ ఏఈఈ నారాయణరావు, డీటీఎల్‌టీఆర్ మనిధర్, డీఎంజీసీసీ సమ్మయ్య, హౌసింగ్ ఏఈ హేమంత్, జేడీఎం హరికృష్ణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, మేనేజర్ ఆదినారాయణ, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బూర్గంపాడు మండలంలో 23 నుంచి 30 వరకు విత్తన మేళా

**బూర్గంపహాడ్, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలంలోని అన్ని రైతు వేదికల్లో ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు “విత్తన మేళా” నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.

విత్తన మేళాలో ప్రభుత్వం ఎంపిక చేసిన అధిక దిగుబడినిచ్చే వివిధ రకాల వరి విత్తనాలు, పలు రకాల కూరగాయల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అలాగే నానో యూరియా, డీఏపీ తదితర ఎరువులను సబ్సిడీ ధరలకు అందజేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతపై రైతులకు అవగాహన కల్పించేందుకు డ్రోన్ స్ప్రేయింగ్, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక సాగు పద్ధతులపై ప్రత్యేక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సూక్ష్మ పోషకాలను ప్రదర్శనతో పాటు సబ్సిడీ ధరలకు విక్రయించనున్నట్లు తెలిపారు. కావున బూర్గంపాడు మండలంలోని రైతులందరూ ఈ విత్తన మేళాలో పాల్గొని ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు. మేళా సమయం: ప్రతిరోజూ ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కోరం కనకయ్య





**టేకులపల్లి, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

టేకులపల్లి మండలం, కొత్తతండా (జి) గ్రామ పంచాయతీ పరిధిలోని బిల్లుడు తండాలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో సోమవారం ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించి, నూతన గృహాలను పరిశీలించారు. సొంతింటి కల సాకారం కావడంతో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరిసింది. ప్రభుత్వం తమకు ఇల్లు మంజూరు చేసి జీవితాల్లో కొత్త వెలుగు నింపిందని లబ్ధిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.దఅనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య లబ్ధిదారులకు స్వీట్లు తినిపించి, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లక్కినేని శ్యామ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాలే ప్రసాద్, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు కోరం సురేందర్, స్థానిక సర్పంచ్ తారాచంద్, హౌసింగ్ ఏఈ గణేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

టేకులపల్లి మండలం, చంద్రుతండా గ్రామపంచాయతీ పరిధిలోని సూర్యతండా గ్రామానికి చెందిన ధరావత్ రవి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రస్తుతం ఇంటికే పరిమితమయ్యారు. అవుట్‌సోర్సింగ్ విధానంలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రవి ప్రమాదం కారణంగా జీవనోపాధిని కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సోమవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రవి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నంతరం కొత్తగూడెం డీఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే, రోడ్డు ప్రమాదానికి సంబంధించి లక్ష్మీదేవిపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయినప్పటికీ బాధితుడికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) నుంచి ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని తెలిపారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ చేపట్టి, బాధితుడికి న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు.

## ఇసుక మాఫియా అక్రమాలకు బలైన నిండు ప్రాణం

**భద్రాద్రి కొత్తగూడెం :** అంబులెన్స్కు సైతం దారి ఇవ్వకుండా లారీలను రహదారిపై అడ్డంగా నిలిపడంతో ఒక నిండు ప్రాణం పోయింది. అంబులెన్స్ కు దారి లేకపోవడంతో కుటుంసభ్యులు భుజంపై రోగిని మోసుకెళ్లిన ఘటన ఇది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మణుగూరు మండలం సాంబాయిగూడెం నుండి రామానుజవరం వరకు రహదారిపై అడ్డంగా ఇసుక లారీలు నిలిపారు. అదే మార్గంలో మణుగూరు మండలం దమ్మక్కపేట గ్రామంలో పురుగుల మందు తాగిన వంశీ(35) అనే వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా, కనీసం అంబులెన్స్కు కూడా ఇసుక లారీలు దారి ఇవ్వలేదు. చివరకు రోగి వంశీని భుజంపై మోసుకుని వెళ్ళే సరికి ప్రాణాలు కోల్పోయాడు. ఇసుక లారీలు రోడ్డును బ్లాక్ చేయడంతోనే వంశీ మృతి చెందాడని చేస్తున్న కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి: ఎమ్మెల్యే

**సూర్యాపేట :** పట్టణంలోని హుజూర్ నగర్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన జి వీ హాస్పిటల్ ను స్థానిక సభ్యురాలు పద్మావతి రెడ్డి ప్రముఖ వైద్యులు జాస్తి సుబ్బారావు తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె హెల్త్చెకప్చేయించుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూదిన దినాభివృద్ధి చెందుతున్న కోదాడ పట్టణానికి జీ వీ హాస్పిటల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు కోదాడ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మెరుగైన వైద్య సేవలు అందించి మంచి పేరు తెచ్చుకోవాలని డాక్టర్లకు యాజమాన్యానికి సూచించారు. పేదలకు అతి తక్కువ ఖర్చులో నాణ్యమైన వైద్య సేవలను అందించాలన్నారు. వైద్యులు సేవాభావంతో పనిచేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని, రాబోయే రోజుల్లో వైద్యం అంటే కోదాడ గుర్తుకు వచ్చేలా పనిచేయాలని గుర్తు చేశారు. జీవి హాస్పిటల్ యాజమాన్యం మాట్లాడుతూ అత్యాధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది సేవలు అందుబాటులో ఉంటాయని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో , కోదాడ మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నేని కుసుమ వెంకటరత్నం బాబు, వైస్ చైర్ పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, కాంగ్రెస్ నాయకులు ఎర్నేని బాబు , కారింగుల అంజన్ గౌడ్,అమీనాబాద్ మాజీ సర్పంచ్ ముత్తినేని కోటేశ్వరరావు ,మున్సిపల్ కౌన్సి లర్లు, కందుల కోటేశ్వరరావు , కాంగ్రెస్ మహిళ నాయకులు కోదాడ టౌన్ లో ఉన్న వివిధ హాస్పిటల్ డాక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

# అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలి..

**ఆల్ ఇండియా స్టూడెంట్స్, జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్...**

**జమ్మికుంట :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రైవేట్ పాఠశాలలు జీవో నెంబర్ 42 కి విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి వారి ఇష్టా రాజ్యాంగ వ్యవహరిస్తున్నారని, ఆల్ ఇండియా స్టూడెంట్స్ జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమ్మ వెంకటేష్, ఈ సందర్భంగా మండల విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, నేడు ప్రైవేట్ పాఠశాలలో ఐఐటి మెడికల్ ఫౌండేషన్ కర్కులం ఆక్టివిటీస్ పేరిట విద్యార్థుల తల్లిదండ్రుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ వారి రక్తాన్ని జలగల పిలుస్తున్నారు, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్న ఆలోచన విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయింది, విద్యాదానం చేయాల్సినటువంటి విద్యా సంస్థలు విద్యార్థుల పాలిట శాపంగా మారి వేలాది రూపాయల ఫీజులను దండుకుంటున్నారు, నేడు ప్రైవేట్ విద్యా సంస్థలు డబ్బుల మీద ఉన్నటువంటి వ్యామోహం విద్యార్థుల భవిష్యత్తు మీద లేకుండా పోయింది, ప్రతి విద్య సంవత్సరం విద్యార్థుల మార్కుల పాస్ పర్సంటేజ్ లో మాత్రం విద్యాసంస్థలు పూర్తిస్థాయిలో విఫలమవుతున్నాయి, అధిక ఫీజుల దోపిడీ మీద ఉన్నటువంటి ఆలోచన విద్యార్థులు భవిష్యత్తు మీద ఉంటే బాగుంటుందని, విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించకుండా అధిక ఫీజుల దోపిడికి పాల్పడుతున్నటువంటి పలు ప్రైవేట్ పాఠశాల పైన ఎంక్వయిరీ చేసి శాఖ పరమైనటువంటి చర్యలు తీసుకోవాలని అమ్మ వెంకటేష్, ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు..

## నేటి నుండి విత్తన మేళా-రైతులకు ఆహ్వానం: వ్యవసాయ అధికారి ప్రభావతి:

**రామడుగు :** రామడుగు మండలంలోని అన్ని రైతువేదికలలో రామడుగు దేశ్రాజుపల్లి వెదిర వెలిచాల రంగసాయి పల్లి గోపాలరావు పేట వేదికలలో ప్రభుత్వ నిర్ణయం మేరకు తేదీ 23 మంగళవారం నుండి తేదీ 30 మంగళవారం వరకు విత్తన మేళా నిర్వహించబడునని వ్యవసాయ అధికారి తెలిపారు. ఈ మేళాలో ప్రభుత్వం సూచించిన మేరకు 7 సన్న రకాల సాంబ మసూరి తెలంగాణ సోనా హెచ్ఎంటి సోనా జై శ్రీరామ్ కూనారం సన్నాలు సిద్ధి కేఎన్ఎం 7715 వరి విత్తనాలు అందుబాటులో ఉంటాయని వ్యవసాయ అధికారి తెలిపారు. రైతులు తమకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను ఒకే చోట కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించబడింది. కావున రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని విత్తన మేళాలో పాల్గొని తమకు కావలసిన విత్తనాలను కొనుగోలు చేసుకోవలసిందిగా రామడుగు వ్యవసాయ అధికారి ప్రభావతి రైతులను కోరారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి.

**ఆటో కార్మిక సంఘం సిఐటియుమండల గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్**

**యుద్ధ ముగిసిన ప్రజలకు ఉపశమనం కల్పించని ప్రభుత్వాలు**

**పరవాడ :** పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ముత్యమాంబ ఆటో కార్మిక సంఘంసిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పరవాడ మండలం వాడ చీపురుపల్లిలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులుగనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న జీవన వ్యయం, ఇంధన ధరల భారం కారణంగా ఆటో కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు గతంతో పోలిస్తే తగ్గుముఖం పట్టాయని, ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ముగిసింది. అయితే తగ్గిన కూడ ఆయిల్ ప్రయోజనాన్ని ప్రజలకు అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించడంలో ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. ప్రజలపై పన్నుల భారం మోపడం ద్వారా ప్రభుత్వాలు భారీ ఆదాయం పొందుతున్నాయని, కానీ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్పై విధిస్తున్న పన్నులను తగ్గించి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులపైనే కాకుండా వ్యవసాయం, రవాణా, చిన్న వ్యాపారాలు, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా పడుతోందన్నారు. ఆటో కార్మికుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా ఇంధన ఖర్చులు, వాహనాల నిర్వహణ వ్యయాలు, విడిభాగాల ధరలు పెరగడంతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల నుంచి తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించలేక అనేక మంది ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. వంటగ్యాస్ ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు కూడా నిరంతరం పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందని పేర్కొన్నారు. ప్రజల ఆదాయాలు పెరగకపోయినా జీవన వ్యయం మాత్రం రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన ధరలను తగ్గించడంతో పాటు ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, బీమా, పెన్షన్, ఆరోగ్య భద్రత, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు షేక్ షబాన్, కే. అప్పలనాయుడు, నరసింహమూర్తి, పైల. తాతారావు, తలారి రామకృష్ణ, పోలవరపు తాతారావు, కూండ్రపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీఓ హత్యతో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆందోళన

**గాదె శ్రీనివాసాచారి**

**మంగపేట, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**



పట్టపగలే ఓ ఆర్డీఓ హత్యకు గురికావడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై తీవ్ర ఆందోళన కలిగిస్తోందని మానవ హక్కుల కమిటీ ఉపాధ్యక్షుడు గాదె శ్రీనివాసాచారి అన్నారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, చట్టాన్ని అమలు చేసే అధికారులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తున్న అధికారుల్లో ఈ ఘటన భయాందోళనలు కలిగించిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఇసుక మాఫియా విచ్చలవిడిగా సాగుతోందని ఆరోపిస్తూ, వాగులు, వంకలు, నదుల్లో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నా ప్రభుత్వం సమర్థవంతంగా నియంత్రించలేకపోతోందని విమర్శించారు. ఆర్డీఓ హత్య కేసులో కేవలం కింది స్థాయి వ్యక్తులపైనే చర్యలు తీసుకుని కేసును ముగించకుండా, ఈ ఘటన వెనుక ఉన్న అసలు సూత్రధారులు, వారికి రాజకీయ పరిరక్షణ కల్పిస్తున్న వారిని కూడా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ ఘటనపై విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి ఆధ్వర్యంలో లేదా సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. నిందితులు ఎంతటి స్థాయి వారైనా చట్టం ముందు శిక్షించబడాలని, రాష్ట్రంలో అక్రమ ఇసుక మాఫియాను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని గాదె శ్రీనివాసాచారి డిమాండ్ చేశారు.

# ప్రజాదర్బార్లో వినతి పత్రం అందజేసిన ముత్తాపురం సర్పంచ్ కల్తీ రాధా



**గుండాల, మన భద్రాద్రి న్యూస్, జూన్ 22**

గుండాల మండలం, ముత్తాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్ కల్తీ రాధా భద్రాచలం ఐటిడిఏ పీఓ రాహుల్ కు ప్రజాదర్బార్ కార్యక్రమంలో గ్రామ ప్రజా సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధా మాట్లాడుతూ.. గుండాల మండలం వెనుకబడిన ప్రాంతంగా ఉన్నందున నీతి అయోగ్ ద్వారా కేటాయించిన నిధులను ముత్తాపురం గ్రామపంచాయతీ పరిధిలోని అభివృద్ధి పనులకు కేటాయించాలని కోరారు. ముఖ్యంగా పాఠశాలలకు ప్రహరీ గోడలు లేని చోట వాటి నిర్మాణం చేపట్టాలని, సొంత భవనాలు లేని అంగన్వాడీ కేంద్రాలకు భవనాల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పెద్దతోగు ఆర్ అండ్ బీ రహదారి పనులకు సంబంధించి అటవీ శాఖ అధికారులతో చర్చించి అవసరమైన అనుమతులు ఇప్పించాలని, ఐటిడిఏ ఏఈ ఆధ్వర్యంలో రహదారి, భవనాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ఇతరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి ఆర్థిక భరోసా

- సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

మణుగూరు మండలం, విట్టల్రావు నగర్కు చెందిన ఈర్ల ఉమారాణికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.60 వేల విలువైన చెక్కును పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజలు ఆపదలో ఉన్న సమయంలో వారికి ఆర్థికంగా అండగా నిలవడమే ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ప్రధాన ఉద్దేశమని అన్నారు. వైద్య చికిత్సలు, అత్యవసర అవసరాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ రైతులను మోసం చేసింది

**దండేపల్లి :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రైతులు, ప్రజలను మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నడిపెల్లి విజత్రావు విమర్శించారు. దండేపల్లి మండల కేంద్రంలో సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడిన మాటలకు.. అధికారంలోకి వచ్చాక మాట్లాడే మాటలకు ఏమాత్రం పొంతన లేదన్నారు. వడ్లు, మక్క కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం బాధ్యతా రహితంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలన రైతులను రాజులను చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారికి వెన్ను పోటు పొడిచిందన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే దివాకర్రావుకు దక్కిందన్నారు. దివాకర్రావు చేసిన అభివృద్ధి పనులు ప్రస్తుత ఎమ్మెల్యే చేసినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటని మండిపడ్డారు. రైతులు పండించిన పంటలకు బస్తాకు 3 నుంచి 5 కిలోల వరకూ కటింగ్ చేసి, రైతుల శ్రమను దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల బిల్లుల్లోనూ కాంగ్రెస్ నాయకులు

# విధి నిర్వహణలో డీటీఓ ఎం. వెంకన్న మృతి బాధాకరం

- భద్రాచలం రవాణా శాఖ అధికారి (ఎం.వి.ఐ) సంగం వెంకట పుల్లయ్య





**భద్రాచలం, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్):**

భూపాలపల్లి జిల్లా రవాణా శాఖ అధికారి (డీటీఓ) ఎం. వెంకన్న విధి నిర్వహణలో ఉండగానే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం అత్యంత బాధాకరమని భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ), అసోసియేషన్ ఆఫ్ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్మెంట్ టెక్నికల్ ఆఫీసర్స్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సంగం వెంకట పుల్లయ్య అన్నారు.

సోమవారం భద్రాచలం రవాణా శాఖ కార్యాలయంలో నిర్వహించిన సంతాప సభలో వెంకన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా సంగం వెంకట పుల్లయ్య మాట్లాడుతూ, భూపాలపల్లి ఆర్టీవో కార్యాలయం ఎదుట విధి నిర్వహణలో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొనడంతో వెంకన్న మృతి చెందడం అత్యంత విషాదకరమని అన్నారు. బదిలీపై భూపాలపల్లికి వచ్చి నెల రోజులే అయిన నేపథ్యంలో విధి నిర్వహణలో ఉండగానే ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం రవాణా శాఖకు తీరని లోటని పేర్కొన్నారు. మృతుడు వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని వారికి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, కానిస్టేబుల్ శివయ్య, సిబ్బంది నాగేశ్వరరావు, భీముడు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి పరిరక్షణ సదస్సుకు తరలిరండి

- నేడు మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు రాక

**ఇల్లందు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**



తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు కొత్తగూడెం క్లబ్లో నిర్వహించనున్న సింగరేణి పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని ఇల్లందు ఏరియా ఉపాధ్యక్షులు జాఫర్ హుస్సేన్ పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సదస్సుకు బీఆర్ఎస్ శాసనసభ పక్ష ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నాయకులు, 11 ఏరియాలకు చెందిన టీబీజీకేఎస్ నాయకులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, సింగరేణి కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

అనంతరం మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్, తెలంగాణ ఉద్యమ నాయకులు దిండిగల రాజేందర్తో కలిసి సదస్సుకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎస్. రంగనాథ్, మాజీ ఉపాధ్యక్షులు అబ్దుల్ నబీ, ఉపేందర్ రావు, రామ్లాల్, శివ, ఇమ్రాన్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# నాగజ్యోతి స్థాయి మరిచి మాట్లాడొద్దు

- కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి పాయం అనిత



**మంగపేట, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

బీఆర్ఎస్ నేత నాగజ్యోతి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి పాయం అనిత తీవ్రంగా ఖండించారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, మంత్రి సీతక్క, కాంగ్రెస్ నాయకుడు పైడాకుల అశోక్లపై మాట్లాడే స్థాయి నాగజ్యోతికి లేదని విమర్శించారు నాగజ్యోతి అదృష్టవశాత్తు సర్పంచ్ నుంచి వైస్ జడ్పీ చైర్మన్ స్థాయికి చేరుకున్నారని, రాజకీయంగా ఎదగడంలో సీతక్క సహకారం కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఆ సహాయాన్ని మరచిపోయి ఇప్పుడు ఆమెపై విమర్శలు చేయడం సరికాదని అన్నారు. ఐదేళ్లపాటు పదవిలో కొనసాగిన నాగజ్యోతి ప్రజల కోసం ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ములుగు జిల్లా అభివృద్ధికి ఆమె చేసిన సేవలు ఏమిటో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. పైడాకుల అశోక్ ప్రజాసేవతో ఎదిగిన నాయకుడని, ఆయనపై అనవసర ఆరోపణలు చేస్తే కాంగ్రెస్ పార్టీ సహించబోదని పాయం అనిత హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి అవగాహనతో విధులు నిర్వర్తించాలి

## • జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)–2026 ప్రక్రియపై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.

సోమవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ–2026 శిక్షణ కార్యక్రమంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎంటీలు, బీఎల్వో సూపర్వైజర్లు, ఏఎల్ఎంటీలు, మండల ఆపరేటర్లకు కలెక్టర్ అంకిత్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపకల్పన కోసం భారత ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందన్నారు. ఈ నెల 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేసి, అవసరమైన వివరాలను సేకరించి బీఎల్వో యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వ్యక్తులు శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లారా, మరణించారా, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదయ్యారా అనే అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. పేర్లు,



చిరునామాల సవరణ, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి ప్రక్రియలను ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చేపట్టాలని సూచించారు. సేకరించిన సమాచారమే తుది ఓటరు జాబితాకు ప్రామాణికంగా ఉండనున్నందున ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ఫారం–6 ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ప్రతి వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండాలని, రెండు లేదా అంతకంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు చేసుకోవడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అలాంటి సందర్భాల్లో క్రిమినల్ కేసులు నమోదయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే ఓటీపీని ఇతరులతో పంచుకోవడం కూడా నేరమేనని స్పష్టం చేశారు.

ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ మాట్లాడుతూ, ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. బీఎల్వోలు ఇంటింటి సర్వేలో సేకరించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని




తెలిపారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో ఒక్క అర్హ ఓటరు కూడా మిగిలిపోకుండా చూడాలని అన్నారు. ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖుల ఓటరు వివరాల ధృవీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, శిక్షణలో వివరించిన అంశాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహనతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియ, ఎన్యూమరేషన్ ఫారాల నిర్వహణ, బీఎల్వో యాప్ వినియోగం, ఓటరు మ్యాపింగ్, ఫారాల పరిశీలన, డేటా నమోదు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రవీంద్రనాథ్, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎంటీలు, బీఎల్వో సూపర్వైజర్లు, ఏఎల్ఎంటీలు, మండల ఆపరేటర్లు, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

కొత్తగూడెం పట్టణంలోని హనుమాన్ బస్తీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తన కుటుంబ సభ్యులతో కలిసి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి విద్యాభ్యాసం, పాఠశాల పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్య జీవితంలో అత్యంత విలువైన సంపద అని, ప్రతి విద్యార్థి అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి విద్యే పునాది అని పేర్కొన్న ఆయన, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు వచ్చి సహకరించాలని



కోరారు. విద్యాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాల్లో సమాజంలోని ప్రతి వర్గం భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో



పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి

## • జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతికి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ అంకిత్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి వినతులు, ఫిర్యాదులను స్వీకరించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న వ్యక్తిగత, సామూహిక సమస్యలను శ్రద్ధగా విని ప్రతి వినతిపత్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ప్రతి వినతిని బాధ్యతాయుతంగా పరిగణించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయంతో సమస్యల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని, వెంటనే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. మిగిలిన సమస్యలను నిర్ణీత గడువులో పూర్తి చేయడంతో పాటు, ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం లేదా జాప్యానికి తావు ఇవ్వొద్దని అధికారులకు సూచించారు. ప్రతి సమస్య వెనుక ఉన్న మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం చూపాలని, ప్రజా సేవలో పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు వినతిపత్రాలతో పాటు అవసరమైన ఆధార పత్రాలు సమర్పిస్తే సమస్యల పరిష్కార ప్రక్రియ మరింత వేగవంతమవుతుందని తెలిపారు.

ప్రజావాణిలో అందిన పలు వినతులను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు తగిన చర్యల కోసం ఎండార్స్ చేశారు.

### ప్రజావాణిలో వచ్చిన ముఖ్య వినతులు

### ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి:

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన వేపల లక్ష్మి



తాను ఇంజినీరింగ్ పూర్తి చేశానని, భర్త అనారోగ్యంతో ఉండటంతో కుటుంబ పోషణ భారంగా మారిందని, ఇద్దరు పిల్లల సంరక్షణ బాధ్యత తనపై ఉందని పేర్కొంటూ అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం కల్పించాలని కోరారు. దీనిపై ఉపాధి కల్పన అధికారికి కలెక్టర్ దరఖాస్తును పంపించారు.

### ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతి

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన షేక్ సఫియా తమ ఇల్లు శిథిలావస్థకు చేరిందని, వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొంటూ ఇందిరమ్మ గృహ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ దరఖాస్తును గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపించారు.

### నిరుపేద కుటుంబానికి గృహం కోరుతూ:

దమ్మపేట మండలం మల్లారం మోడల్ కాలనీకి చెందిన మోదంపరపు సత్యవతి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తమకు ఇందిరమ్మ గృహం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఎండార్స్ చేశారు.

### మత్స్య సహకార సంఘం ఏర్పాటు కోరుతూ:

టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామపంచాయతీ గ్రామస్తులు తమ గ్రామం పేరుతో కొత్త మత్స్య సహకార సంఘం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. దీనిపై జిల్లా మత్స్యశాఖ అధికారికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

### ఉద్యోగంలో పునర్నియామకం కోరుతూ:

పాల్వంచ టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ పాఠశాలలో పార్ట్‌టైమ్ తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేసిన విజయనిర్మల, పదో తరగతి ఫలితాల ఆధారంగా తనను విధుల నుంచి తొలగించారని పేర్కొంటూ తిరిగి విధుల్లో కొనసాగేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ దరఖాస్తుపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆర్సీఓకు కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వైద్య చికిత్సకు రూ.2.50 లక్షల ఎల్ఓసీ అందజేసిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

పినపాక మండలం, జానంపేట గ్రామానికి చెందిన కోసూరి సుభాష్ చంద్ర మహారాజ్ వైద్య చికిత్స కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) ను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకుండా ముఖ్యమంత్రి నాయకత్వంలోని ప్రభుత్వం వివిధ వైద్య సహాయ పథకాల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక చేయూత అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వైద్య సహాయ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబానికి అండగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**రూ.4 లక్షల ఎల్ఓసీ అందజేత**



**మణుగూరు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

మణుగూరు మండలం, రామానుజవరం గ్రామానికి చెందిన తోకల వెంకటమ్మ వైద్య చికిత్స కోసం రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)ను పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రజలు ఆపదలో ఉన్నప్పుడు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్సకు దూరం కాకుండా ప్రభుత్వం వివిధ వైద్య సహాయ పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, వైద్య సహాయ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి అంశాలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసిన అల్లపల్లి గ్రామ ప్రతినిధులు



**మణుగూరు, జూన్ 22 (మన భద్రాద్రి న్యూస్)**

అల్లపల్లి మండలం, అల్లపల్లి గ్రామపంచాయతీ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రజా సమస్యలు, మౌలిక వసతుల కల్పనపై గ్రామ ప్రతినిధులు పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సోమవారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రచార కమిటీ అధ్యక్షుడు వాసం శ్రీకాంత్, గ్రామ సర్పంచ్ వాసం సుష్మిత ఆధ్వర్యంలో గ్రామ ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, తాగునీటి సమస్య, రహదారుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణతో పాటు ఇతర ప్రజా సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాభివృద్ధికి అవసరమైన చర్యలను త్వరితగతిన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.డి. అత్తాహర్, సతీష్, ఎన్. శ్రీను, పి. మంగ, పద్మ, శైలా, ఎన్. నరసింహారావు, కె. అఖిల్, ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.